## కాలనీలో చెట్ల కొమ్మల తొలగింపు



ఇంద్రప్రస్థ కాలనీలో చెట్లకొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్త కాపు అరుణ

సైదాబాద్, ఏప్రిల్ 29:సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఇంద్ర ప్రస్థ కాలనీలో చెట్టుకొమ్మలు పడి కరెంటు స్తంభంతో పాటు చెట్ల కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్ పై విరిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చి మరమ్మతు పనులను చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ సిబ్బంది, జీహెచ్ఎంసీ హార్టికల్చర్ సిబ్బందితో కలిసి చెట్టుకొమ్మలను తొలగింపజేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు. కార్యక్రమంలో ఆస్మాన్ ఘాట్ డీఈ ఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈ వినోద్‌రెడ్డి, ఏఈ సత్యనారాయణ, కాలనీవాసులు జగన్, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు లేకుండా పూడికతీత పనులు



సెంట్రల్ బ్యాంక్ కాలనీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 29: మ్యాన్‌హోల్, ఓపెన్ నాలాలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగింపజేసి వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోల్‌లలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ..రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా నాలాల పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు శుభాకాంక్షలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 29:నూతనంగా జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ వీ కర్ణన్, ఐఏఎస్‌ని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ సీహెచ్.కృష్ణ, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ మంద రవి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, సెక్రటరీ మురళి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం, సూపరింటెండెంట్ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు



పల్లకి సేవలో స్వామివారు

ఆర్కేపురం, ఏప్రిల్ 29: మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధి వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవములు మంగళవారం వైభవంగా జరిగింది. లక్ష్మీనారాయణ ఇష్టి హవనం, హంసవాహనసేవ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని ఆలయ చైర్మన్ సోమ సురేశ్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, మజ్జిగ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేశ్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రవణ్, శ్రీధర్, రామ కిషన్ పాల్గొన్నారు.

# కాలనీలకు నిధులు కేటాయింపులో విఫలం

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతోనే హరిపురి కాలనీలో డ్రైనేజీ పనులు



రైట్ హరిపుర కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మూరుకుంట్ల అరవింద్‌శర్మ తదితరులు

ఆర్కేపురం, ఏప్రిల్ 29:కాలనీలో అభివృద్ధికి నిధులు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మునుకుంటా అరవింద్ శర్మ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ హరిపురి కాలనీ రోడ్ నెం.1లో గత కొన్నేండ్లుగా ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, కాలనీ అసోసియేషన్ సభ్యులు గత ఎన్నికల ముందు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులతో మాట్లాడి డ్రైనేజీ పనుల కోసం రూ.20లక్షలతో టెండర్ మంజూరు చేయించి ఆ పనులను మంగళవారం అరవింద్‌శర్మ కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాలనీలో పేరుకుపోయిన సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో మంజూరు చేయించిన నిధులన్ని రోజులకు కేటాయించడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా పరిపాలన చేస్తున్నదో ప్రజలకు అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి బాటలో నడిచిన కాలనీలు నేటి ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. ఈ డ్రైనేజీ పూర్తయితే సంవత్సరాలుగా హరిపురి కాలనీ ప్రజలు పడుతున్న మురుగునీరు ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించిన ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, శ్యాంగుప్తా, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్ గుప్త, జనరల్ సెక్రటరీ నోముల మురళి, కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రావు, యాదగిరి, వంశీ, అనిలకుమార్, యాదగిరి రెడ్డి, సుంకర రవి, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటాం

### ఎంఎల్‌సీ బొగ్గరపు దయానంద్ గుప్తా

ఎల్బీనగర్, ఏప్రిల్ 29: సీనియర్ సిటిజన్స్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంఎల్‌సీ బొగ్గరపు దయానంద్ గుప్తా అన్నారు. మంగళ వారం తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ 11వ వార్షిక సర్వసభ్య సమావేశం అధ్యక్షులు మారం భరత్‌రెడ్డి అధ్యక్షతన చైతన్యపురి సాయినగర్ కాలనీ, సీనియర్ సిటిజన్‌హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైనా దయానంద్‌గుప్తా మాట్లాడుతూ..పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. సీనియర్ నాయకులు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత అవయవదాతల సంఘం అధ్యక్షురాలు డా. గూడూరి సీతమహాలక్ష్మి, మ్యాక్సి విజన్ కంటి ఆసుపత్రి డా. వంశీధర్, మధుమేహ నిపుణుడు డా. జి. రాజశేఖర ప్రసంగించారు. సీనియర్ సిటిజన్స్ సంఘం సెక్రటరీ జనరల్ చోళ ఓంప్రకాశ్ యాదవ్ వార్షిక నివేదిక, కోశాధికారి గోరెంట్ల ప్రసాద్ వార్షిక ఆదాయ నివేదికలు సమర్పించగా..సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. 75 సంవత్సరాల పైబడిన సీనియర్ సభ్యుల సన్మానం, వివాహ జీవితంలో 50 సంవత్సరాలు పూర్తిచేసిన దంపతుల ఘనసన్మానం, మ్యాక్సి విజన్ కంటి ఆసుపత్రి వారి ఉచిత కంటి శిబిరం, డా. మోహన్ డయాబెటిస్ సెంటర్ వారి ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.

## మత విద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రం



దెబ్బడగూడలో మాట్లాడుతున్న కృష్ణనాయక్

కందుకూరు,ఏప్రిల్ 29:కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి చూస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రతిజ్ఞ చేసిన అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి మాజీ జెడ్పీటీసీ బొక్కజంగారెడ్డిలతో కలిసి మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడిన తీరును తప్పుపట్టారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తుందని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి జంగారెడ్డి, మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సొడపు వెంకటేశ్ గౌడ్, అందుగుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు డైరెక్టర్లు యుగేందర్ గౌడ్, సురేందర్, సులేమాన్, బుక్క ప్రశాంతి పాండురంగారెడ్డి, జగన్, శ్రీను, పడమటి సురేందర్ రెడ్డి, సామ వెంకట్ రెడ్డి, గంగుల సురేందర్ రెడ్డి, బొడ్డు బాల్రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పరిశీలిస్తున్న జిల్లా హౌసింగ్ పీడీ

బడంగ్ పేట్, ఏప్రిల్ 29: ఇందిరమ్మ ఇండ్ల కోసం, అర్హులైన ఇల్లు లేని పేద వారిని గుర్తించాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ ప్రత్యేక సెక్రెటరీ(పీడీ) వీపీ.గౌతమ్ ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మంఖాల్, 10వార్డు, మహేశ్వరం మండలంలోని సిరిగిరిపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల యొక్క ఎంపిక జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలు ఇంటిఇంటికి తిరిగి తనిఖీ చేశారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల కుటుంబ ప్రస్తుత నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ..ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి కచ్చితమైన సర్వే చేసి ప్రభుత్వానికి అందించాలన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుక రావాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమలో దరావత్ చంప్లా నాయక్, ప్రాజెక్టు డైరెక్టర్, తుక్కుగూడ కమిషనర్ వాణి, మహేశ్వరం మండలం తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజా రెడ్డి, రామ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## అపరిష్కృత సమస్యలన్ని త్వరలో పరిష్కరిస్తా

### ఎమ్మెల్యే అహ్మద్ బాలా



ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని అయోధ్యనగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలకు సమస్యలను చూపిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట, ఏప్రిల్ 29: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అయోధ్యనగర్‌లోని అపరిష్కృత సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. జీహెచ్ఎంసీ వివిధ శాఖల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి వసతి, రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలుపగా, స్పందించిన ఆయన, వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని,ఇప్పటికే డివిజన్ పరిధిలోని అనేక కాలనీలో వరదనీటి సమస్యను పరిష్కరించేందుకు బాక్స్ డ్రైన్‌లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేయడం జరిగిందని, డ్రైనేజీ, తాగునీటి వసతులు, రోడ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశామని ఆయన తెలిపారు. కాలనీలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య నిర్వహణ లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ పీర్ సింగ్, ఏ ఈ ముబిన్ పాష, వాటర్ వర్క్స్‌మలక్‌పేట సబ్ డివిజన్ డీజీఎం హష్మత్ అలీ, విద్యుత్ శాఖ ఏఈ, పారిశుధ్య విభాగం అధికారులు, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, అయోధ్యనగర్ కాలనీవాసులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



పంజాగూడ అంగన్‌డీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న నాయకులు,టీచర్లు

కందుకూరు, ఏప్రిల్ 29: చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని మండల పరిధిలోని ఆకుల మైలారం మాజీ సర్పంచ్ గొరిగే కలమ్మ రాజు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని పంజగూడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ఐదేండ్లలోపు ఉన్న పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యుత్‌తోపాటు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాల కంటే దీటుగా ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కరుణ సురేశ్, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, వనజ, లక్ష్మి,జ్యోతి, గర్భిణి మహిళలు, కిశోర బాలికలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ధ్యానాంజనేయ స్వామికి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పూజలు



చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ బాధ్యుల సమక్షంలో వారిని మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించగా.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ వేద పండితులు, అర్చక బృందం శంకర్ ప్రసాద్, అంబ ప్రసాద్, చంద్రకాంత్ శర్మ, ముత్యాల శర్మ, సంతోష్‌కుమార్, శ్రవణ్‌లచే ఆ దంపతులకు ప్రత్యేక అర్చనలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వచనాలు అందజేసి, శాలువాలతో సత్కరించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి వెంకటయ్య, మాజీ ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, మధు సాగర్, యాదిరెడ్డి, మేక సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – చంపాపేట, ఏప్రిల్ 29

## ప్రపంచ స్థాయిలో గుర్తింపు

కందుకూరు, ఏప్రిల్ 29 : కందుకూరును మహానరంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బేగర్ కంచ వద్ద ఏర్పాటు చేసే ఫ్యూచర్ సిటీ మ్యాపును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుందని తెలిపారు. దేశానికి తల మానికంగా ఉండబోతుందని వివరించారు. భవిష్యత్తులో కోకాపేట్‌ను మించిన స్థాయిలో ఎదుగుతుందని పేర్కొన్నారు.




## ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సైదాబాద్ తాసిల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న శంకేశ్వరబజార్ ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు

సైదాబాద్, ఏప్రిల్ 29: సైదాబాద్ శంకేశ్వర్ బజార్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షులుగా పొన్న దశరథ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గుడాల శంకర్ ముదిరాజ్, కట్టెల కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా జి. శంకర్ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గద్ద గుంటి పరమేశ్ ముదిరాజ్, పి. జనార్దన్ ముదిరాజ్, కోశాధికారిగా గద్దగుంటి కిశోర్ ముదిరాజ్, సలహాదారులుగా కట్టెల సత్యనారాయణ ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సైదాబాద్ మండల తాసిల్దార్ జయశ్రీని కలిసి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటీ వివరాలను, వినతిపత్రాన్ని అందజేసి ముదిరాజ్ కులం ధృవీకరణ పత్రాల కోసం తాము ప్రతిపాదించేవారిని పరిగణములోకి తీసుకొని ముదిరాజ్ కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, శంకేశ్వర బజార్ లోని సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్ ను వారు కోరారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, ఏప్రిల్ 29: మండల పరిధిలోని కటికపల్లి గ్రామానికి చెందిన గుండ్రపల్లి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుడ్డోల్ల నరేందర్ గౌడ్ మృత్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వారి ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి రూ.6వేలు అందజేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బర్ల శంకర్, అశోక్, బాలరాజ్, బుడ్డోల్ల సుధాకర్ గౌడ్, యాదయ్య, పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాలు కేటాయించే వరకు ఉద్యమం



లబ్ధిదారులతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్

కందుకూరు, ఏప్రిల్ 29. లబ్ధిదారులకు ఇండ్లస్థలాలు కేటాయించే వరకు ఉద్యమం కొనసాగుతుందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఇండ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి 788 సర్వే నంబర్లు, ప్లాట్ల స్థలాల వద్ద చదును చేసి అక్కడే ఉన్న లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు చూపించే వరకు పోరాటం ఆగదని తెలిపారు. రెవెన్యూ అధికారులు పట్టాలని ఇచ్చి ప్లాట్లను చూపించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని , ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనంలేదన్నారు. గత్యంతరం లేక తామే స్వయంగా వచ్చి చదును చేసుకున్నట్లు వివరించారు. తక్షణమే అధికారులు స్పందించి ఇండ్ల స్థలాలు చూపించాలని, లేనిపక్షంలో లబ్ధిదారులు స్వయంగా ఇల్లు కట్టుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మంచం ఇందిర, అన్వర్, భాష, అంజయ్య, జంగమ్మ, యాదమ్మ, అలివేలు, శంకరమ్మ ,శ్రీను, నరసింహ పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు, ఏప్రిల్ 29: పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2009, 2010, పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 15 ఏండ్ల అనంతరం మంగళవారం ఒకచోట కలుస్తున్నారు. అలనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని సన్మానించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో వేసిన చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. రోజంతా కలిసి వెళ్లి ఆట పాటలతో గడిపిన అనంతరం అందరూ కలిసి ఒకచోట సహపంక్తి భోజనం చేశారు.కార్యక్రమంలో అలనాటి ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## ఎండీహెచ్ఎం పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీహెచ్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

# ఉగ్రవాదుల చర్యలు ఖండించాలి

సైదాబాద్, ఏప్రిల్ 29: పహల్గాంలో ఉగ్రవాద దాడికి నిరసనగా సైదాబాద్ బ్యాంక్ కాలనీల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పిస్తూ, బాధితులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హ రిగౌడ్, ఎస్బీహెచ్ గడ్డి అన్నారం కాలనీ అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి రమేశ్, సహాయ కార్యదర్శి ఆనంద్, ఎస్బీహెచ్ పంచ కాలనీ సభ్యులు రావికంటి శ్రీనివాస్, సూదం రవి, వివేకానంద కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




సైదాబాద్ ఎస్బీహెచ్ కాలనీలో క్యాండిల్ నిర్వహించి నివాళులర్పిస్తున్న కాలనీవాసులు